
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

మంగళవారం 13 మే 2025



ఉష్ణోగ్రత

గరిష్ఠం 39.9

కనిష్ఠం 21.7



సమస్యలను వింటున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రజావాణికి 46 దరఖాస్తులు

రంగారెడ్డి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. మొత్తం 46 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 21, ఇతర శాఖల నుంచి 25 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆమె వాల్ పోస్టర్‌ను సంబంధితశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నర్సింహాచారి

'యువ వికాసం'లో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలి

మొయినాబాద్ రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌లలోనూ 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి వడ్ల నర్సింహాచారి కోరారు. ఈ మేరకు మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇచ్చి వారి జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో సంధ్యరాణి, షాబాద్ దర్శన్, సురేష్, జ్ఞానేశ్వర్ గౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఐస్‌క్రీమ్ అంటే ఎవరైనా లొట్టలేసుకొని తింటారు. చిన్నాపెద్ద తేడా లేకుండా ఎంతో ఇష్టంగా కొనుక్కుంటారు. ఇక సమ్మర్‌లో అయితే వీటికి యమా డిమాండ్ ఉంటుంది. మండుటెండల్లో ఐస్‌క్రీమ్ తింటే ఆ మజానే వేరు. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు కేటుగాళ్లు కాసులకు కక్కుర్తిపడి ఐస్‌క్రీమ్‌లను కల్తీ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ఏమైతే మాకేంటి అని కాలం చెల్లిన రసాయనాలు, మితిమీరిన రంగులు వాడేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఐస్‌క్రీమ్ తయారీదారులు రెచ్చిపోతున్నారు.

- అనుమతులు లేకుండా తయారీ
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కంపెనీలు
- కాలం చెల్లిన కెమికల్స్ వినియోగం
- ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని ఫుడ్‌సేఫ్టీ అధికారులు

చల్లటి విషం!

ఆరోగ్యాన్ని హరిస్తున్న ఐస్‌క్రీములు

రంగారెడ్డి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : అసలే ఎండాకాలం.. రోడ్డుపై ఐస్‌క్రీమ్ బండి కనిపిస్తే చాలు తినకుండా ఎవరైనా ఉండగలరా..? ఎండల నుంచి ఉపశమనానికి కొందరు.. అలవాటుగా మరికొందరు ఐస్‌క్రీమ్‌లు తినేస్తుంటారు. ఐస్‌క్రీమ్ అంటే ఇష్టపడని వారుండరు. ముఖ్యంగా పిల్లలు అయితే రోజూ ఐస్‌క్రీమ్ కావాలని మారం చేస్తుంటారు. ఎక్కడ బండి కనిపించినా.. షాపు చూసినా కొనేంత వరకు తల్లిదండ్రులను వదిలిపెట్టరు. అలాగే శుభకార్యాల్లోనూ ఐస్‌క్రీమ్‌లు పెడుతుంటారు. ఇలా డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని కొందరు కల్తీరాయుళ్లు రెచ్చిపోతున్నారు. నాసిరకం ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఐస్‌క్రీమ్‌ల తయారీలో రసాయనాలు అతిగా వినియోగిస్తూ విషాన్ని పంచుతున్నారు. నాణ్యత లోపించిన ఉత్పత్తులను మార్కెట్‌లో చలామణి చేస్తూ వ్యాపారులు ఏటా కోట్ల రూపాయలకు పడగెత్తుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు లేకుండా జిల్లాలో అనేక మంది వ్యాపారులు ఐస్‌క్రీమ్‌లు, ఐస్‌లు తయారు చేస్తున్నారు. విషయం తెలియక విష పదార్థాలతో

మిగతా 8వ పేజీలో...



ఐస్‌క్రీమ్‌లతో అనర్థాలు



ఐస్‌క్రీమ్ ఆకర్షణీయంగా ఉండేందుకు దానిపై రకరకాల రసాయనిక ఫ్లేవర్లను వినియోగిస్తారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి చేటు. ఇలాంటి వాటిని తింటే పేగుల్లో సమతుల్యత దెబ్బతిని జీర్ణకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. రసాయనాలు అతిగా వినియోగించడం వల్ల ఊపిరితిత్తి ఇబ్బందులు ఎదురవుతాయి. పాలు, చాక్లెట్ అనేక రకాల డ్రైఫ్రూట్స్, చెర్రీస్ మొదలైన వాటిని ఐస్‌క్రీమ్‌లో ఉపయోగించడం వల్ల ఆరోగ్యపరంగా ప్రయోజనం ఉంటుంది. కల్తీ ఐస్‌క్రీమ్‌లు తింటే మాత్రం ఇబ్బందులు తప్పవు

- డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

సమాచారం

కేశంపేటలో నేటి నుంచి ధ్యానోత్సవం

కేశంపేట మే12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేటి (మంగళవారం) నుంచి మూడు రోజులపాటు హార్ట్‌ఫుల్‌నెస్ రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ శివాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, మే12 (ఆంధ్రజ్యోతి): 2025–26 విద్యా సంవత్సరానికిగాను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో చేరేందుకు కాలేజీ కోడ్(12038)తో దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని మొదటి వెబ్ ఆప్షన్‌గా ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని ఆమె సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న ఈ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, డెయిరీ సైన్స్ (క్రాప్ ప్రొడక్షన్), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్)లాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆప్షన్లు 22 వరకు ఇచ్చేందుకు అవకాశముందన్నారు. తొలిదశ సీట్ల కేటాయింపు 29న జరుగనుండగా సెల్ఫ్ రిపోర్టింగ్ ఈ నెల 30 నుంచి జూన్ 9 వరకు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9819996725, 9441705076 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



వైభవంగా కల్యాణ మహోత్సవాలు

- వేడుకల్లో పాల్గొన్న భక్తులు
- ప్రత్యేక పూజలు.. అన్నదానాలు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

6

హైవే విస్తరణకు మోక్షం ఎప్పుడో?

2014లో జాతీయ రహదారిగా హైదరాబాద్-శ్రీశైలం రోడ్డు

- రెండు లేన్ల రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు
- 765 రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని డిమాండ్
- 167కే హైవే పూర్తయితే మరింత పెరగనున్న రద్దీ
- తరచూ ప్రమాదాలు.. చొరవచూపని ప్రజాప్రతినిధులు



విస్తరణకు నోచని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి

ఆమనగల్లు, మే12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి విస్తరణ కలగానే మిగిలింది. వాహనాల రద్దీ పెరగడంతో ఈ రహదారిపై నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఐదేళ్లలో ఈ రోడ్డుపై జరిగిన యాక్సిడెంటుల్లో సుమారు 50మంది వరకు మృతి చెందగా, వందల మంది గాయపడ్డారు. ఈ జాతీయ రహదారిని విస్తరించాలని ఏళ్ల కాలంగా ముఖ్యమంత్రులు,

మిగతా 8వ పేజీలో...

కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం



శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్‌తో కలిసి జాతీయ రహదారి విస్తరణ గురించి విన్నవించాం. మూడు నెలల్లో పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ హైవేపై వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయం గురించి ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకుపోతా.

- డాక్టర్ మల్లు రవి, ఎంపీ

సేవకు ప్రతిరూపం నర్సులు

» డాక్టర్ రాజేంద్రప్రసాద్



కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

రంగారెడ్డి అర్బన్/ చేవెళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : సేవకు ప్రతిరూపం నర్సులని చేవెళ్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చేవెళ్ల ఆసుపత్రిలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులతో కలిసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంలో నర్సులు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. అన్ని సమయాల్లో రోగికి తోడుగా ఉంటూ జబ్బును నయంచేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రాణాపాయ స్థితిలో, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మెరుగైన సేవలందించి, వారిని మామూలు స్థితికి తీసుకురావడంలో నర్సులకు సాటి ఎవరు లేరని ఆయన తెలిపారు. వైద్యసిబ్బంది స్నేహత, రేణుక, అరుణ, సుజాత, సునంద, సవిత, జ్యోతి, నర్సమ్మ, స్రవంతి, వీసీటీసీ అధికారి ప్రతాప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

» మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారం చేసేందుకే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి, కల్వకుర్తి, వెల్దండ మండలాల ఎంపీడీవోలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం పథకాల అమలుపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు, ఇప్పటి వరకు మంజూరైన వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులైన నిరుపేదలు ఉంటే దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలను అనుసరించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడత 3500 ఇళ్లు మంజూరైనట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండాచూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు వెంకట్రాములు, సుజాత, కుసుమ మాధురి, శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, మైమూద్, నాయకులు బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్, యాడ నర్సింహా, బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంగి ఆనంద్, అశోక్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, పాలకుర్ల రాముడుల, బిచ్యానాయక్, మోతిలాల్, జగన్, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, గుర్రం కేశవులు, రవీందర్, విజయ్‌కుమార్‌రెడ్డి, బిక్యానాయక్, వెంకటేశ్, హిరాసింగ్, బాబా, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మానయ్య, బాలరాజు, బొజ్జ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న దస్తావేజు లేకర్లు, స్టాంపు వెండర్లు

మహేశ్వరం మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని దస్తావేజుల లేకర్లు, స్టాంపు వెండర్ల సంఘం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నేతలు గోపాల్ రెడ్డి, జి.యాదయ్య, ఫరీద్, రమేష్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలకు ఇబ్బంది కలగకుండా దస్తావేజులు తయారు చేసి జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ పద్ధతి ద్వారా ఉపాధి కోల్పోయామని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దస్తావేజు లేకర్లు, స్టాంపు వెండర్ల 50వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, విజయలక్ష్మి, నవీన్‌గౌడ్, కుషాల్, భరత్, రఘు, కృష్ణ పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మురుగును పరిశీలిస్తున్న అధికారులు

యాచారం, మే 12(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ, ఎంపీవో శ్రీలత తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మురుగు నీటి సమస్యకు పరిష్కారమేదీ?' కథనానికి అధికారులు స్పందించారు. వారు గ్రామంలో పర్యటించి సమస్యను పరిశీలించారు. భూసర్వేను చేపట్టి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మురుగు నీటిని చెరువులోకి మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. గ్రామ కంఠం భూమిని సర్వే చేసి తమకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ దంతుక పెద్దయ్య ఆధ్వర్యంలో తహసీల్దారు టి.అయ్యప్పకు వినతిపత్రం అందించారు.

హైటెన్షన్ వైర్లను సరిచేస్తాం

యాచారం మండలంలో వదులుగా మారి కిందికి వేళాడుతున్న 120 కేవీ వైర్లను సరిచేస్తామని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన 'హైటెన్షన్' కథనానికి వారు స్పందించారు. సోమవారం అయ్యవారి గూడ, నజ్దిక్‌సింగారం గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఆయా చోట్ల వైర్లు డీలా పడినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు.

గాలివాన బీభత్సం.. నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

చౌదరిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో ఇంద్రనగర్‌కు వెళ్లే దారిలో దిమ్మెకూలి ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. దీంతో పాటు విద్యుత్ స్తంభం కూడా కిందపడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



వైభవంగా కల్యాణ మహోత్సవాలు

- వేడుకల్లో పాల్గొన్న భక్తులు
- ప్రత్యేక పూజలు.. అన్నదానాలు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గ్రామాలు



ఇబ్రహీంపట్నం: శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సమీపంలోని కొండపై వెలిసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కృప నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, వసంత దంపతులు స్వామివారికి వెండి పాదాలు చేయించి ఆలయ అధికారులకు అందజేశారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో జరిగిన శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి పాల్గొన్నారు. సోమవారం మండల పరిధిలోని పోచారంలో జరిగిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అనంతపద్మనాభస్వామి కల్యాణంలో దంపతులు

అనంతపద్మనాభస్వామి ఆలయంలో..

కొత్తూర్: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అనంతపద్మనాభస్వామి కల్యాణ మహోత్సవం ఆలయ పాలకమండలి చైర్‌పర్సన్ బెజవాడ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ తంతు జరిగిన తర్వాత అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, విశాలశ్రవణ్, ఆలయ కమిటీ సభ్యులు కుమ్మరి రమేశ్, ఇంద్రసేన, పద్మారెడ్డి, శంకర్, నాయకులు సిద్దార్థరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, నవీన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దేశాల భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



మర్పల్లి: ఆలయం ఎదుట రథోత్సవంలో గ్రామస్తులు

మర్పల్లి: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం భద్రకాళీ భద్రేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 19 వరకు ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పాండు శర్మ నేతృత్వంలో సోమవారం రుద్రహోమం, స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. ప్రతి పౌర్ణమిన రుద్రహోమం నిర్వహిస్తున్నారు.

సందడిగా కట్టమైసమ్మ జాతర

పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శామీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ జాతర సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారు ఆలయం వద్ద భవిష్యవాణి (రంగం ఎక్కారు) వినిపించారు. పోతరాజులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి గంగ తెప్పను వదిలారు. ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.



శామీర్‌పేట కట్టమైసమ్మ ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు

పంట మార్పిడితో అధిక దిగుబడి

రైతు కమిషన్ సభ్యుడు రాములునాయక్



మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రాములునాయక్

ఘట్‌కేసర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి పద్ధతిని పాటించాలని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములునాయక్ అన్నారు. సోమవారం పోచారంలో జరిగిన రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రైతులు ఒకే పంటను ఎక్కువసార్లు ఆదే భూమిలో సాగు చేయడం వల్ల భూసారం తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. వరి పంటకు బదులు జొన్న, సజ్జ, రాగులు, కొర్రలు, పెసర్లు, మినుములు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ జె.సురేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, ఏఓ బాసిత్, సహకార సంఘం వైస్ చైర్మన్ అనంతరెడ్డి, రైతుబంధు మండల మాజీ కమిటీ చైర్మన్ కొంతం అంజిరెడ్డి, రైతులు రాములు, ప్రభ ఆకర్‌రెడ్డి, యాదగిరి, బాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకుపై సమగ్ర నివేదిక ఇవ్వాలి



కులకచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంకుపై జూన్ 24లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్‌ను నివేదిక కోరింది. గ్రామంలో ఎస్సీ కాలనీ వెనక ఓవర్ హెడ్ ట్యాంకును 30 ఏళ్ల క్రితం నిర్మించారు. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ట్యాంకు పైభాగం పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం ట్యాంకులోకి నీరు వదలడం లేదు. ఓ దినపత్రికలో వచ్చిన కథనంపై హెచ్‌ఆర్‌సీ స్పందించింది. సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్‌ను కోరింది.

సాంకేతిక సమస్యతో నిలిచిన భూ రిజిస్ట్రేషన్లు

దోమ, మే 12 (ఆంధ్రజ్యోతి): దోమ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ భారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్య కారణంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన రైతులు, వ్యాపారస్తులు సాయంత్రం వరకు వేచి ఉండి చేసేదేమి తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులును వివరణ కోరగా ఉదయం నుంచే సాంకేతిక సమస్యతో పోర్టల్ ఓపెన్ కాలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి రిజిస్ట్రేషన్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రైతుభరోసా అందరికీ వర్తింపజేయాలి

పరిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, పంట రుణాల మాఫీని అర్హులందరికీ పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని తెలంగాణ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావులకు వినతిపత్రాన్ని అందజేశారు. టీకేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రుణమాఫీ సగం మంది రైతులకు కూడా కాలేదన్నారు. ఎస్‌బీఐ ఖాతాల రైతులకు అసలే మాఫీ కాలేదన్నారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పది ఎకరాల వరకు ఇవ్వాలన్నారు. 40 శాతం మందికి రైతుభరోసా, రుణమాఫీ కాలేదని, వీరందరికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఆర్డీవో వాసుచంద్రకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విజయ్‌కుమార్

పెద్ద చెరువు కాల్వాల పరిశీలన

బొంరాస్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఏటి కాల్వ, పంట కాల్వలను ఇరిగేషన్ అధికారులు రమణారెడ్డి, శ్రీధర్, జోసెఫ్, కిరణ్, శ్రీకాంత్, వంశీకృష్ణ సోమవారం పరిశీలించారు. పెద్ద చెరువు మరమ్మతులకు రూ.3 కోట్ల 80 లక్షలతో పంట కాల్వలు, ఏటి కాల్వలు తదితర వాటి మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, రైతులు లచ్చప్ప, గోపాల్, పాండు, రాములు, సత్య వెంకట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కాల్వలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు



ఆమనగల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



చౌడాపూర్: పూజల్లో గ్రామస్తులు, నాయకులు

అమర జవాన్లకు ఘన నివాళి

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన భారత సైనికులు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌లకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు నివాళి అర్పించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేనావత్ పత్యానాయక్, పాపిశెట్టి రాము, గోరటి నర్సింహ, నరేందర్ రాథోడ్, రవిరాథోడ్, రమేశ్‌నాయక్, విక్రమ్‌రెడ్డి, లక్ష్మణ్, శేఖర్, కృష్ణ యాదవ్, ఈశ్వర్, భరత్, మల్లేశ్, గణేశ్, పంతునాయక్, జయరాంబాలు, నరేశ్, సీతారాం, మహేశ్, విజయేందర్, రాజు, చందు, అమర్‌సింగ్, శ్రీనునాయక్, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్: భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సైనికులు ఆయురారోగ్యాలతో ఉండాలని మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

» టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్


మాట్లాడుతున్న లక్ష్మీనివాస్

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అద్దె భవనాలు, శిథిల భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, విద్యా సంస్థలకు నూతన భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్రంలో అనుమతులు లేని విద్యా సంస్థలను సీజ్ చేసి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యా శాఖకు మంత్రిని నియమించాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రఘు, సుధాకర్, సంపత్ ఉన్నారు.


బట్టల కొలతలను పరిశీలించిన డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు

యూనిఫాం కొలతల ప్రకారం కుట్టాలి

» డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు

చౌదరిగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫాంను కొలతల ప్రకారం కుట్టాలని డీఆర్‌డీఏ డీపీఎం నర్సింహులు అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని యూనిఫాం స్టిచ్చింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరిపోయేవిధంగా డ్రెస్‌లు ఉండాలని టైలర్లకు సూచించారు. మండలంలో ఎదిర, చౌదరిగూడ, ఎల్కాగూడలో కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం విద్యార్థుల సంఖ్య 2,464 ఉండగా అబ్బాయిలు 1,164, అమ్మాయిలు 1,300 మంది ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి ధనలక్ష్మి, ఏపీఎం నరసింహ, సీసీలు రమేష్, దేవయ్య పాల్గొన్నారు.


విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఏబీవీపీ నాయకులు

సమ్మర్ క్యాంప్ పేరుతో తరగతులా?

» విద్యార్థులను ఇళ్లకు పంపిన ఏబీవీపీ నాయకులు

కడ్తాల్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కడ్తాల కృష్ణవేణి పాఠశాల నిర్వాహకులపై ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. సమ్మర్ క్యాంప్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎంఈవోకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కృష్ణవేణి పాఠశాల వద్దకు చేరుకున్నారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులను చూసి పాఠశాలను బంద్ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో నాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్, విజయ్‌కుమార్, పవన్, శ్రీకాంత్, సాయికిశోర్, శ్రీకాంత్, విష్ణు, దర్మేందర్, మున్న, ఆనంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చేవెళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి ఆరోపించారు. సోమవారం మండల పరిధిలోని రామన్నగూడలో గ్రామ కార్యదర్శి పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తోందని, స్థానిక సంస్థల్లో పరిపాలన లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూటీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మక్బూల్, శివ, మంజుల, మీనాక్షి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెంటయ్య, నాయకులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఆమనగల్లు/తలకొండపల్లి, మే12(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆరోపించారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లాలునాయక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్మికులుతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు.


వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

వాహనాలకు వేలం.. రూ.4,91,824 ఆదాయం

ఆమనగల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో పట్టుబడ్డ ఎనిమిది వాహనాలకు నిర్వహించిన వేలం ద్వారా రూ.4,91,824 ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఎస్‌ఐలు అరుణ్‌కుమార్, స్వప్న, కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మేడ్చల్ ప్రతినిధి, మే 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభం కాకముందే జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ డిమాండ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ హరిప్రియకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగు నీటి సదుపాయం, రాత్రి వాచ్‌మెన్‌లు, ఆయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌ను, అటెండర్‌ను నియమించాలన్నారు. తరగతి గదులను, ప్లే గ్రౌండ్స్, మధ్యాహ్న భోజనం తయారీకి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆక్రమణలను తొలగించి సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ కమిటీ సభ్యులు బి.సుధారాణి, జావేద్, షరీఫ్, అజీమ్ బేగ్, ఎండీ షహబాగ్, యూనస్, ఎస్.ఎన్.రెడ్డి, బి.రమ్యాగౌడ్, షీల, శ్రీలత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

» ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేయాలి

» వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైద్యాధికారులు విధిగా బాధ్యతలు నిర్వర్తించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, బ్లడ్‌బ్యాంక్, విధుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని, లేరని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన దూరాన్ని పరిగణనలోకి తీసుకుని ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్లాక్ స్పాట్లను గుర్తించాలి

రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను మరోసారి పరిశీలించాలని, రోడ్డు భద్రత సమావేశాలు ఏర్పాటు చేసి బ్లాక్ స్పాట్లను గుర్తించాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. ప్రమాదాలు జరిగితే గాయపడ్డ వారికి సత్వర వైద్య సేవలు అందే విధంగా ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఒక్కో సెంటర్‌కు రూ.5.5 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యాపకులు, వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వసతి గృహాలు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. వైద్య కళాశాల, వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ అజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

» షాద్‌నగర్ ఎమెమల్యే వీర్లపల్లి శంకర్


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల తహసీల్దార్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో భూతగాదాలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పైలట్ ప్రాజెక్టుగా కొందుర్గు మండలాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. రైతులకు, వారసులకు న్యాయబద్ధంగా చెందాల్సిన భూవాటాలు (కమతాలు) తేడాలు రాకుండా గ్రామీణ స్థాయి ప్రజాక్షేత్రంలోనే న్యాయం జరుగుతుందన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

హంతకులిద్దరికీ జీవిత ఖైదు

» ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా

వికారాబాద్/యాలాల, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హత్య కేసులో నిందితులిద్దరికీ జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్పీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. కొడంగల్ మండలం ఎరన్‌పల్లి గ్రామానికి చెందిన దోమ బుగ్గప్ప అదే గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్‌ను చంపుతానని బెదిరించాడని 2 ఏప్రిల్ 2015న పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. అప్పటి ఎస్‌ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ హరిలాల్ గ్రామానికి వెళ్లాడు. పంచాయతీ కార్యాలయం వద్ద రాములుగౌడ్, అతడి సోదరుడు లక్ష్మయ్యగౌడ్, పకీరప్ప, అప్పటి ఉప సర్పంచ్ నర్సప్పతో పాటు పలువురు గుమిగూడి కనిపించారు. కానిస్టేబుల్ బుగ్గప్ప గురించి ఆరా తీయగా, తిమ్మాయిపల్లి గేట్ వద్ద ఉన్న ఉన్నాడని తెలపడంతో అక్కడకు వెళ్లాడు. బుగ్గప్పను కానిస్టేబుల్ బైక్‌పై కూర్చోబెట్టుకుని కొడంగల్ పోలీసు స్టేషన్‌కు వెళ్తుండగా జుంటుపల్లి గేట్ దాటిన తర్వాత రాములుగౌడ్, అతడి సోదరుడు పకీరప్ప, నర్సప్పతోపాటు మరో ఇద్దరు బైక్‌ను ఆపారు. రాములుగౌడ్ బుగ్గప్పను లాగడంతో ఇద్దరూ కిందపడిపోయారు. రాములుగౌడ్ తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో బుగ్గప్ప తలపై బలంగా నరకడంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. రాములుగౌడ్ సోదరుడైన లక్ష్మయ్యగౌడ్ తన అన్న వద్ద ఉన్న వేట కొడవలి తీసుకుని బుగ్గప్ప తల, ఇతర శరీర భాగాలను తీవ్రంగా గాయపరిచాడు. అదే సమయంలో ఇతరులు కూడా బుగ్గప్పను గాయపరిచారు. దీంతో బుగ్గప్ప ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తర్వాత అందరూ పారిపోయారు. ఈ ఘటనపై యాలాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాగా అప్పటి యాలాల్ ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా, అప్పటి కరణ్‌కోట్ సీఐ శివశంకర్ దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న తర్వాత బుగ్గప్పను హతమార్చిన ఘటనలో నిందితులైన ఈడిగి రాములుగౌడ్, ఈడిగి లక్ష్మయ్యగౌడ్‌లకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణగౌడ్, రవికుమార్, సుధాకర్‌రెడ్డిలకు, దర్యాప్తు చేసిన అప్పటి, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, నగేష్, యాలాల్ ఎస్‌ఐ గిరన్న, సీడీవోలు జి.శ్రీశైలం, ఎం.శ్రీనివాస్, బ్రీఫింగ్ అధికారి వీరన్నలను ఎస్పీ అభినందించారు.

గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్



హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో హయత్‌నగర్ కల్వంచ శాంతినగర్‌లోని బాలుర గురుకుల ప్రతిభ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 15న బాలురకు, 16న బాలికలను కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతిలో సాధించిన మార్కుల మెమో, స్టడీ, కండక్టు సర్టిఫికెట్లు, 2024-25 సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించి ఆదాయం ఉండరాదని పేర్కొన్నారు. ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్ పీహెచ్‌సీ, ధ్రువీకరణ పత్రాలు, మూడు కలర్ పాస్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

కోర్సుల వివరాలు

జంగంమెట్ బాలికల కళాశాల, ఎంపీసీ, బైపీసీ కోర్సులు, (హైదరాబాద్ జిల్లా), ఇబ్రహీంపట్నం బాలుర కళాశాల, ఎంపీసీ, బైపీసీ కోర్సులు (రంగారెడ్డి జిల్లా), కందుకూరు బాలుర కళాశాల సీఈసీ, హెచ్‌ఈసీ(రంగారెడ్డి జిల్లా), కొత్తురు బాలుర కళాశాల సీఈసీ, హెచ్‌ఈసీ (రంగారెడ్డి జిల్లా), కుల్కచర్ల బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), కొడంగల్ బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), తాండూరు బాలికల కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(వికారాబాద్ జిల్లా), జిన్నారం బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు (సంగారెడ్డి జిల్లా), నారాయణఖేడ్ బాలుర కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(సంగారెడ్డి జిల్లా), కంగ్టి బాలుర కళాశాల సీఈసీ, హెచ్‌ఈసీ(సంగారెడ్డి జిల్లా), జహీరాబాద్ బాలిక కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు(సంగారెడ్డి జిల్లా), కరాసుగుత్తి బాలిక కళాశాల ఎంపీసీ, బైపీసీ కోర్సులు (సంగారెడ్డి జిల్లా) ప్రతి గ్రూపు నందు ఎస్టీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, ఓసీ, స్పోర్ట్స్ పీహెచ్‌సీ క్యాటగిరి నందు పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు.. 95020 50715, 96034 31550 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

» కొనుగోలు కేంద్రాల్లో అధికారుల ఇష్టారాజ్యం

» వర్షానికి తడుస్తున్న ధాన్యం


మిట్టకోడూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో..

పరిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సకాలంలో ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిగి మండలం మిట్టకోడూరు కొనుగోలు కేంద్రానికి ధాన్యం భారీగా వచ్చింది. తూకం వేయడంలో జాప్యం జరుగడంతో కేంద్రంలో ధాన్యం బస్తాల నిల్వలు పెరుకుపోయాయి. దీంతో రైతులు రాత్రిపూట అక్కడే నిద్రపోవాల్సి వస్తుంది. ఆది, సోమవారం సాయంత్రం వర్షం కురువడంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రైతులు తాడిపత్రిలు కప్పినప్పిటికీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

చెస్‌లో సత్తాచాటిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి


చెస్ ఆడుతున్న పట్లోళ్ల ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్ మే 12(ఆంధ్రజ్యోతి): యూరప్ బాస్నియాలో జరిగిన ఇంటర్నేషనల్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ 1804 చెస్ ఫిడే రేటింగ్స్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మనవడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి సత్తా చాటాడు. ఇంటర్నేషనల్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించి 400 ఫిడే పాయింట్లను పెంచుకున్నాడు. 1804 పాయింట్‌లతో ఫిడే రేటింగ్స్‌లో తన ప్రతిభను కనబరిచాడు. గ్రాండ్ మాస్టర్ సలహాలు, సూచనలు పాటిస్తు గ్రాండ్ మాస్టర్ మరియన్ పెట్రోవ్‌తో కలిసి చెస్ ఆడుతూ కేవలం ఐదు నెలల్లోనే అత్యధిక పాయింట్లను సాధించి రేటింగ్స్‌ను పెంచుకున్నాడు. ఇంద్రారెడ్డి సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య సురేష్ తెలిపారు. నానమ్మ సబితా ఇంద్రారెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఆట ఆడుతున్నానని ఇంద్రారెడ్డి తెలిపారు.



శంకర్‌లింగం చేతులమీదుగా పట్టా అందుకుంటున్న సామల నాగరాజు

ఇంజినీరింగ్‌లో పరిశోధనలు చేయాలి

మొయినాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు చేయడం దేశానికి ఎంతో అవసరమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శంకర్‌లింగం అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్(ఈఈఈ) విభాగంలో సామల నాగరాజు ప్రొఫెసర్ బేతి చంద్రమౌళి పర్యవేక్షణలో 'గ్రిడ్ ఇంటిగ్రేషన్ ఆఫ్ హైబ్రీడ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టం విత్ ఫాక్ట్స్ యూసింగ్ నోవెల్ కంట్రోల్ టెక్నిక్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పట్టాను పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశోధనలు చేసే విద్యార్థులకు తమ యూనివర్సిటీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. విద్యతోపాటు పరిశోధనలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, రీసెర్చ్ డీన్ ఆచార్య క్రిష్టోఫర్, రాజు, జగదీశ్వర్, రాజేందర్‌రెడ్డి, జగదీష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాంబాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


గిరిగేట్‌పల్లి బ్రిడ్జి కింద పారుతున్న మురుగు

రైల్వే బ్రిడ్జి కిందికి మురుగు

» దుర్వాసనతో వాహనదారుల ఇబ్బందులు

వికారాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గిరిగేట్‌పల్లి గ్రామం వెళ్లే ప్రధాన రోడ్డులోని రైల్వే బ్రిడ్జి కింద డ్రైనేజీ నీరు వాగులా పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని అధికారులకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


నర్సులను సన్మానిస్తున్న వైద్యులు నాగరాజు, మంజులాదేవి

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ఆమనగల్లు, మే12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి పరిధిలోని నర్సులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ మంజులా దేవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఉత్తమ సేవలందించిన ఏఎన్ఎమ్‌లు, స్టాఫ్ నర్సులు, హెడ్‌నర్సులను నాగరాజు, మంజులాదేవిలు పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్, సిబ్బంది ఏసుమని, హెప్సిబా, సునిత, రత్నజ్యోతి, గాయత్రి, అలివేలు, నాగేశ్వరి, వీణ, నీరజ, భారతమ్మ, రవికుమార్, వేణు, శ్రీను, తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలాల వద్ద విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఏడీతో ఫోన్‌లో మాట్లాడితే సానుకూలంగా స్పందించాడన్నారు. ఈమేరకు రెవెన్యూ సమస్యలను పరిష్కారించాలని అధికారుల దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో సం ఘం సభ్యులు, రైతులు వీరేశం, పెంటారెడ్డి, వెంకట్‌రెడ్డి, విశ్వనాథం, రాంరెడ్డి, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణకు మోక్షం ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పాలక ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా స్పందన లేదు. డీపీఆర్ సిద్ధం చేసినట్లు కేంద్ర మంత్రులు పేర్కొంటున్నా.. పనులను మాత్రం ప్రారంభించడం లేదు.

పెరిగిన వాహనాల రద్దీ

హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతుంది. వేల వాహనాలు, లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటిఈ జాతీయ రహదారిని విస్తరించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైవేగా మారి 11ఏళ్లవుతున్నా విస్తరణకు నోచుకోలేదు. రెండు లేన్ల ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్రం మంత్రి కిషన్ రెడ్డిలు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి ఈ హైవేను విస్తరించాలని కోరారు. మాజీ ఎంపీ పోతుగంటి రాములు, ప్రస్తుత ఎంపీ డాక్టర్ మల్లు రవి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు కూడ మంత్రిని కలిసి రోడ్డు విస్తరణ ఆవశ్యకత గురించి వివరించారు. అయినా నేటికీ స్పందన లేదు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితమే రూ.1275 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినా నేటికీ నిధులు విడుదల కాలేదు.

2014లో జాతీయ రహదారిగా గుర్తింపు

ఆర్అండ్‌బీ శాఖలో ఉన్న హైదరాబాద్-శ్రీశైలం రహదారిని 2014లో 765వ జాతీయ రహదారిగా గుర్తించారు. తెలంగాణలో రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 191 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 79 కిలోమీటర్ల మేర ఈ హైవే నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తోకపల్లి వరకు ఉన్న 270 కిలోమీటర్ల రోడ్డును రూ.320 కోట్లతో అభివృద్ధి చేశారు. అప్పట్లోనే నాలుగు లేన్లుగా రోడ్డును విస్తరించాలని స్థానిక నాయకులు, ప్రజలు, కోరినా... అప్పటి వాహనాలు, ప్రయాణికుల రద్దీకనుగుణంగా రెండు లేన్ల రోడ్డుగా నిర్మాణం చేసి మైసిగండి, హాజిపూర్‌ల వద్ద టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం వాహనాల రద్దీ పెరగడంతో రహదారిపై ప్రయాణమంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు రద్దీ విపరీతంగా పెరిగిపోయింది.


హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రాంసుంతల వద్ద రోడ్డు ప్రమాదం(ఫైల్)

765కు అనుసంధానంగా 167కే..

కల్వకుర్తి సమీపంలోని కొట్రగేటు నుంచి కొల్లాపూర్‌లోని సోమశిల, కరివెన మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు కొత్తగా 167కే జాతీయ రహదారిని గుర్తించి ఏడాది క్రితం పనులు చేపట్టారు. కొత్తగా ప్రకటించిన 167కే హైవే... హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండడంతో ముందుగా ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తే తప్ప ప్రయోజనం ఉండదని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. సోమశిల మీదుగా కొత్తగా నిర్మించే జాతీయ రహదారి పూర్తయితే హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా తిరుపతి వెళ్లడానికి దూరభారం తగ్గుతుంది. దీంతో వాహనదారులు ఎక్కువగా ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరిస్తేనే శ్రీశైలం, తిరుపతి జాతీయ రహదారులు అనుసంధానమై వాహనాల రద్దీని తట్టుకోగలుగుతుంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీకి ఇచ్చిన వినతి పత్రంలో ప్రస్తావించారు. తుక్కుగూడ ఓఆర్ఆర్ నుంచి కల్వకుర్తి మధ్య ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల 765 జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని ముఖ్యమంత్రి కోరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. వీలైనంత త్వరగా విస్తరణ పనులు జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మోదీని కలిసి విన్నవించాం



హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్ విస్తరించాలని పీఎం మోదీ, కేంద్రమంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డిలకు విన్నవించాం. కేంద్రం రహదారి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటుంది.

- తల్లోజు ఆచారి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు

క్రైం కార్నర్

పాపం చిన్నారి

● కారు డోర్లు లాక్.. ఊపిరాడక మృతి


అక్షయ(ఫైల్)

కడ్తాల్, మే 12(ఆంధ్రజ్యోతి): కారు డోర్లు లాక్ అవడంతో ఊపిరాడక ఓ చిన్నారి మృతి చెందింది. మండలంలోని మక్తమాదారం గ్రామంలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. స్థానిక సీఐ గంగాధర్ కథనం మేరకు.. మక్తమాదారం గ్రామానికి చెందిన అక్కారి యాదయ్య-మహేశ్వరి దంపతులు.. కూతురు అక్షయ(5)తో కలిసి కారులో ఆదివారం చర్చికి వెళ్లారు. అనంతరం అందరూ తిరిగి వచ్చాక కారు దిగి ఇంట్లోకి వెళ్లిపోయారు. హడావిడిలో కారు డోర్లు లాక్ చేయకపోవడంతో అక్షయ మళ్లీ కారులో ఎక్కి కూర్చుంది. కొద్దిసేపటి తరువాత అక్షయ ఇంట్లో కన్పించకపోవడంతో బయట ఆడుకుంటుందని తల్లిదండ్రులు భావించారు. సాయంత్రమైనా ఇంట్లోకి రాకపోవడం, ఇంటి సమీపంలో కన్పించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అనుమానం కలిగి కారులో చూడగా అక్షయ అపస్మారక స్థితిలో కనిపించింది. కారు డోర్లు తీసి చూడగా శరీరం మొత్తం బొబ్బలుపోయి అప్పటికే మృతిచెందింది. సోమవారం చిన్నా రి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపా రు. మృతదేహాన్ని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట న ర్సింహ సందర్శించి నివాళులర్పించారు. బాలిక తల్లిదండ్రులను ఓదార్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. మహిళ దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో సోమవారం సాయంత్రం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కథనం మేరకు.. షాబాద్ మండలం అంతారం గ్రామానికి చెందిన శివకుమార్ తన భార్య అనూష(24)తో కలిసి బైక్‌పై షాద్‌నగర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఐరన్ పరిశ్రమ వద్దకు రాగానే షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చేవెళ్లకు వెళుతుండగా వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దాంతో అనూష బస్సు టైర్ల కింద పడిపోయింది. ఎడమ కాలు మోకాలు విరిగి చర్మం ఊడిపోయింది. ఇతర శరీర భాగాలకూ బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్టును కారు ఢీకొన్న ఘటనలో యువకుడు..

ఆమనగల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. ఆమనగల్లు పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. ఏపీకి చెందిన అజయ్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన అతడి స్నేహితులు సేనాపతి మనోజ్, సలాడి గణేశ్, కొడాలి త్రిమూర్తులు కలిసి సోమవారం షిఫ్ట్ కారులో హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆమనగల్లు సంగీత వైన్‌షాప్ వద్ద పంది రోడ్డుపై అడ్డంగా రావడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారు నడుపుతున్న అజయ్‌కుమార్(32) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మనోజ్, గణేశ్, త్రిమూర్తులు తీవ్రంగా గాయపడగా కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. ఈమేరకు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సేనాపతి మనోజ్ ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీఫామ్‌లో ప్రమాదం.. యజమాని మృతి


నిల్యానాయక్ (ఫైల్)

కేశంపేట, మే 12(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ ఫామ్‌లో జరిగిన ప్రమాదంలో పౌల్ట్రీ యజమాని మృతిచెందగా పలువురికి తీవ్ర గాయలైన ఘటన కేశంపేట మండలం కాకునూరు శివారులో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిల్యా నాయక్ తన పౌల్ట్రీఫామ్‌లో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు దాణా యంత్రం ఒక వైపుకు ఒరిగిపోయింది. గమనించిన నిల్యా నాయక్ వర్కర్లతో కలిసి యంత్రాన్ని సరిచేయడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో దాణా యంత్రానికి ఉన్న చక్రాలు ముందుకు జారడంతో యంత్రం ఒక్కసారిగా అందరిపై పడింది. నిల్యా నాయక్‌తో పాటు వర్కర్లకు గాయాలయ్యాయి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. పౌల్ట్రీ యజమాని నిల్యా నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య గోబ్రి ఇద్దరు కూతుళ్ల, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిల్యా నాయక్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

చల్లటి విషం!

(5వ పేజీ తరువాయి)

తయారయ్యే ఐస్‌క్రీమ్‌లు తింటూ ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

చల్లటి పదార్థాల పేరుతో..

జిల్లాలో చాలా మంది కల్తీ సరుకును తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐస్‌క్రీమ్ పేరుతో వీటిని అమ్మడం లేదు. చల్లటి పదార్థాలు అనే పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. పాల పదార్థాలతో నాణ్యమైన కిలో ఐస్‌క్రీమ్ తయారు చేయాలంటే రూ.300 ఖర్చువుతుంది. పామాయిల్, డాల్డా, పాల పొడితో కిలో కల్తీ ఐస్‌క్రీమ్ తయారు చేసేందుకు రూ.50 ఖర్చువుతుంది. వెన్న, పాలు, జీడిపప్పుతో నాణ్యమైన ఐస్‌క్రీమ్‌లు తయారు చేయాలి. కల్తీ వ్యాపారులు పంచదారకు బదులుగా తీపి కోసం శాక్రిన్ కలుపుతున్నారు. కల్తీ ఐస్‌క్రీమ్‌లు తిన్నవారికి శరీరంలో కొవ్వుశాతం పెరుగుతుంది.

పత్తాలేని ఫుడ్‌సేఫ్టీ అధికారులు

జిల్లాలో కల్తీ ఐస్‌క్రీమ్‌ల తయారీ దందా రోజురోజుకూ పెరిగిపోతుంది. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలపై నిఘా పెట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ ఏడాది ఎక్కడా కనిపించడం లేదు. గత ఏడాది కల్తీ ఐస్‌క్రీమ్‌ల తయారీని ముఠా గుట్టురట్టు చేసి రూ.9.1 లక్షల విలువ చేసే ముడి సరుకు, యాంత్రాలు, వాహనాలను సీజ్ చేశారు. కానీ.. ఈ ఏడాది టాస్క్‌ఫోర్స్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు పత్తా లేకుండా పోయారు. దీంతో విచ్చలవిడిగా నకిలీ ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు.

కాలంచెల్లిన రసాయనాలతో..

ఆకర్షణ కోసం ఐస్‌క్రీమ్‌ల తయారీలో వివిధ రకాల రసాయనాలు, రంగులను ఉపయోగిస్తున్నారు. వీటి తయారీకి కూలింగ్ చాంబర్‌లు ఉండాలి. ఐస్‌క్రీమ్‌లను సాధారణంగా మూడు నెలల్లో ఉపయోగించాలి. ఐస్‌క్రీమ్‌ల కవర్లపై తయారైన తేదీ, గడువు ముగింపు తేదీ, ధర, కంపెనీ పేరు, బరువు తదితర స్టిక్కర్లు వేయాలి. అయితే జిల్లాలో చాలామంది నిబంధనలు పాటించడం లేదు.

నాణ్యత లేని పదార్థాలతో..

ఐస్‌క్రీమ్ తయారీలో జీడిపప్పు, చెర్రీ ఫ్రూట్స్, పైనాపిల్ వంటి పదార్థాల మిశ్రమాలను తయారీలో ఉపయోగించాలి. యజమానులు లాభాపేక్షతో నాణ్యతలేని పదార్థాలతో కల్తీ ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు. కాగా, వీటిని ఎక్కువ కాలం నిల్వ చేయడానికి విచ్చలవిడిగా రసాయనాలు ఉపయోగిస్తున్నారు. వీటిని తిన్నవారికి జీర్ణకోశ వ్యాధులు వస్తాయని వైద్యులు తరచూ చెబుతున్నారు.

అనుమతిలేని రంగుల వినియోగం..

ఐస్‌క్రీముల్లో అనుమతి లేని రంగులను ఎక్కువ శాతం వాడుతున్నారు. దీంతో పాటు తయారీ కంపెనీలకు లైసెన్సులు కూడా లేవు. అత్యంత హాని కలిగించే శాక్రిన్‌ను మోతాదుకు మించి వాడుతున్నట్లు సమాచారం. దీని వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. డ్రమ్ముల్లో నీళ్లు నింపిన వారం పదిరోజుల తర్వాత కూడా అవే నీటిని ఐస్‌క్రీమ్‌ల తయారీకి వినియోగిస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా ఐస్‌క్రీముల్లో హైఫ్యాట్, మీడియం ఫ్యాట్, లోఫ్యాట్ రకాలు వాడతారు. కానీ ఈ ఫ్యాట్ మోతాదు సరైన స్థాయిలో ఉండకపోవడంతో ఐస్‌క్రీమ్ నిల్వలలో తేడా వస్తుంది.

అనుమతి లేకుండానే..

జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా కుప్పలు తెప్పలుగా ఐస్‌క్రీమ్ తయారీ జరుగుతోంది. ఈ వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఫుడ్ లైసెన్స్, జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీగా నమోదు కావాలి. కార్మికశాఖ, పర్యావరణ, తూనికల కొలతల శాఖ అనుమతులు ఉండాలి. ప్యాకింగ్ లైసెన్స్ తేవాలి. కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ ఉండాలి. ఐస్‌లు తయారు చేసేందుకు నిపుణులను నియమించుకోవాలి. ఎప్పటికప్పుడు శాంపిల్స్‌ను ల్యాబ్‌లలో పరీక్ష చేయించాలి. నాణ్యమైన నీటిని ఉపయోగించాలి. జిల్లా వ్యాప్తంగా ఈ నిబంధనలు పాటించడం లేదు.


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న శివశంకర్ గౌడ్, గ్రామస్థులు

ప్రభుత్వ భూములను కాపాడాలి

మొయినాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోలుకట్ట గ్రామంలో ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈమేరకు రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తోలుకట్ట గ్రామానికి చెందిన మొయినాబాద్ మండల కాంగ్రెస్ నాయకుడు శివశంకర్‌గౌడ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి పూర్తి వివరాలను సేకరించి ప్రభుత్వ భూమిని కాపాడాలని అన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి పత్రాలను కలెక్టర్ కార్యాలయంలో అందజేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సర్వేనంబర్ 155లోని 14 గుంటల ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై గతంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శివశంకర్‌గౌడ్, నర్సింహ, మల్లేష్, విక్రమ్, సురేందర్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య, నర్సింహ వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

ఆమనగల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్‌లు అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను సోమవారం ప్రసాద్, శ్రీకాంత్‌లు సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ గీతనర్సింహ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన శిబిరాన్ని సందర్శించి రైతులకు భోజనాన్ని వడ్డించారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, పాండురంగయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులున్నారు.

మోదీపై అసత్య ప్రచారం.. వ్యక్తిపై ఫిర్యాదు

కందుకూరు, మే 11(ఆంధ్రజ్యోతి) ప్రధాని మోదీపై వాట్సాప్‌లో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆ పార్టీ నాయకులు, గ్రామస్థులతో కలిసి సోమవారం కందుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన గణేశ్‌నాయక్ ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాళ్లమీద పడి పాకిస్థాన్‌తో యుద్ధం ఆపమని కోరుతున్నట్లు ఫొటో క్రియేట్ చేసి తన వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకున్నట్లు ఆరోపించారు. ఆయనపై దేశద్రోహం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేందర్‌రెడ్డి, భూమిరెడ్డి, నర్సింహగౌడ్ తదితరులున్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


బీరప్ప ఆలయంలో నిర్వహించిన పూజల్లో సబితాఇంద్రారెడ్డి, మల్లేష్ తదితరులు

కందుకూరు, మే 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉట్లపల్లి గ్రామంలోని దేవునిగుట్టపై సోమవారం శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రేవెళ్ల రాజుశర్మ సమక్షంలో ఉదయం సర్వదేవతలకు అభిషేకాలు, పూజలు, సుదర్శన హోమం, శ్రీరుద్ర హోమం, ఆంజనేయ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి తిరుకల్యాణాన్ని ఆలయం ఆరుబయట జరుపుకున్నారు. ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డిలతో పాటు ఉట్లపల్లి, ముచ్చర్ల గ్రామాల పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

బీరప్పస్వామి పరిణయ మహోత్సవం

కందుకూరు మండలంలోని కొలన్‌గూడలో సోమవారం బీరప్పస్వామి కామరాతిదేవి కల్యాణ మహోత్సవాన్ని కనులపండుగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్‌లు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లకోసారి గ్రామాల్లో నిర్వహించుకుంటున్న బీరప్పస్వామి కామరాతిదేవి కల్యాణ మహోత్సవం కొలన్‌గూడలో వైభవంగా జరుపుకోవడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఉదయం కల్యాణం, మధ్యాహ్నం స్వామివారి గుడికి మంద బలి నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గీతేశ్వరీ గణేష్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహరెడ్డి, మహేందర్‌రెడ్డి, దశరథ, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, తదితరులున్నారు.


చెన్నకేశవస్వామి పూజలో ఈటల రాజేందర్

పంట మార్పిడిపై దృష్టి సారించాలి


కొత్తూర్ : అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రామాంజనేయులు

చౌదరిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ భూసార పరిశోధన విభాగం, నీటి యాజమాన్య విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, రాజమణిలు అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో ఏవో రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వేసిన పంటలు మళ్లీ వేసినట్లయితే బాగా నష్టపోతారని, చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గిపోతుందని, భూమి సైతం నిస్సారంగా మారుతుందన్నారు. పంట మార్పిడితో ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సోనిశ్రీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, ఏఎంసీ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ శివకుమార్, నీలయ్య, రామకృష్ణారెడ్డి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని శాస్త్రవేత్తలు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ చైతన్యలు సూచించారు. కొడిచర్ల గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. రసాయన ఎరువులు అవసరం మేరకు వినియోగించాలని, సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని సూచించారు. మొక్కలను పెంచి భావి తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, రైతులున్నారు.

యాచారం : పంటల ఎదుగుదలకు అధిక మోతాదులో ఎరువులు వాడరాదని శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్ రైతులకు సూచించారు. నక్కర్తమేడిపల్లి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడాలని, తక్కువ పెట్టుబడులతో తక్కువ పొలంలో అధిక లాభాలు గడించడంపై రైతులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు, ఏవో రవినాథ్ తదితరులున్నారు.


శంషాబాద్ రూరల్ : బెక్‌లెట్ విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

శంషాబాద్ రూరల్ : పెద్దగోల్కొండ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పవన్ చంద్రారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ భూసార, సాగునీటి పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వాడాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో నార్సింగ్ ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ఏఈవో రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి మహోత్సవానికి రూ.లక్ష విరాళం


గ్రామస్థులకు చెక్కు అందిస్తున్న అవినాష్‌రెడ్డి

షాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్‌లో ఈనెల 19న నిర్వహించే బొడ్రాయి పండుగకు హాజరుకావాలని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిని గ్రామస్థుల కలిసి సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. తనవంతు సాయంగా బొడ్రాయి మహోత్సవానికి అవినాష్‌రెడ్డి రూ.లక్ష విరాళం ప్రకటించి గ్రామస్థులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పొన్న నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



ఆమనగల్లు, మే12(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి. రమాకాంత్‌ను సోమవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంబేద్కర్ యాదిలాల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమాకాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

'గాలికుంటు' నివారణ టీకాలు వేయించాలి

మొయినాబాద్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి సూచించారు. సోమవారం కాశింబౌళి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం నజీబ్‌నగర్‌లో టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేయనున్నట్లు చెప్పారు. వీఎస్ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


నజీబ్‌నగర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న దేవిరెడ్డి

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నేడు(మంగళవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో ఎం.ఏ పాషలు సోమవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

క్రీడాకారులకు తోడ్పాటునందించాలి

కడ్తాల్, మే12(ఆంధ్రజ్యోతి): క్రీడలు, విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గిరిజన నేత, కాంగ్రెస్ జిల్లా నాయకుడు హీరాసింగ్ అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జూనియర్ క్రీడాకారులకు హీరాసింగ్ సోమవారం క్రీడా దుస్తులను సమకూర్చి స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీర ధారుఢ్యం, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు దరఖాస్తు


ఎమ్మెల్యేకు దరఖాస్తులిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు

ఆమనగల్లు, మే12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు పార్టీ దరఖాస్తులు స్వీకరిస్తోంది. నూతన అధ్యక్షుల నియామకానికి అధిష్టానం దరఖాస్తులు ఆహ్వానించింది. ఈమేరకు ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్ష పదవికి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు గుర్రం కేశవులు దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి దరఖాస్తు అందజేశారు. ఆమనగల్లు మండల, మున్సిపాలిటీ అధ్యక్ష పదవులకు పోలెపల్లికు చెందిన కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేక దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌ఖాద్రీ, నాయకులు రచ్చ శ్రీరాములు, తాళ్ల రవీందర్, శ్రీను నాయక్, తదితరులు ఉన్నారు.